ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 11 ఆగస్టు 2024




జిల్లా ఆస్పత్రిలోని మార్చురీ భవనం

శవాల నరకం

పోస్టుమార్టమ్ చేయాలంటే పైసలివ్వాల్సిందే

- ఇటీవల రూ.ఆరు వేలు వసూలు
- పీక్కుతింటున్న సర్వజనాస్పత్రి సిబ్బంది
- బాలింతల వార్డులో బిడ్డకో లెక్క
- చోద్యం చూస్తున్న యంత్రాంగం


మార్చురీలో నిరుపయోగంగా శవాలను భద్రపరిచే ఫ్రీజర్స్



జిల్లా ఆస్పత్రిలో కొందరు శవాలపై పేలాలు ఏరుకుంటున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఆస్పత్రి కంటే నరకమే నయమనేలా కొందరి తీరు ఉన్నట్లు బాధితులు వాపోతున్నారు. అసలే తమ మనిషి చచ్చిపోవడంతో పుటెడు దుఃఖంలో ఉన్న వారిని సైతం కాసుల కోసం పీడిస్తున్నారు. డబ్బులిస్తేనే పోస్టుమార్టం చేస్తామంటూ వేధిస్తున్నారు. ఇవ్వకపోతే గంటలతరబడి నిరీక్షించాల్సిందేనన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా తెలిసినా పర్యవేక్షణాధికారులు మిన్నకుండిపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.
- అనంతపురం టౌన్

● వారం కిందట ఓ మృతదేహానికి పోస్టుమార్టమ్ చేయడానికి డాక్టర్లు రూ.ఆరు వేలు వసూలు చేశారు. ఈ విషయంపై కలెక్టరుకు ఫిర్యాదు వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. పోస్టుమార్టం చేయకుండా వేధిస్తుంటే తామే మధ్యవర్తులుగా ఉండి డబ్బులు ఇప్పించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఓ పోలీసులు విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. దీన్నిబట్టి ఆస్పత్రిలో పోస్టుమార్టమ్ చేయాలంటే కాసులు ఎంత మేర పీక్కుతింటున్నారో తెలుస్తోంది.


మార్చురీలో రాతిబండపై మృతదేహం

ఫ్రీజర్స్‌లో ఉంచకుండా బయటే మృతదేహాలు

శవాలు పాడైపోకుండా ఉండేందుకు మార్చురీలో ఫ్రీజర్లు ఉంచారు. అధికారిక లెక్కల మేరకు జిల్లా ఆస్పత్రిలో ఆరు ఫ్రీజర్లు ఉన్నాయి. అయితే మృతదేహాలను మాత్రం ఫ్రీజర్లలో ఉంచడం లేదు. మార్చురీలో బండలతో కట్టిన కట్టలపై పడేస్తున్నారు. ఎండాకాలంలో అయితే ఆ శవాలు గంటల వ్యవధిలోనే పాడైపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. కనీసం కుటుంబసభ్యులు, బంధుమిత్రులు మార్చురీలోకి వెళ్లి మృతదేహాలను చూడాలన్నా ఇబ్బంది పడాల్సివస్తోంది. ఆరు ఫ్రీజర్లు ఉన్నా అవి ఎపుడు సక్రమంగా పని చేయడంలేదని చెబుతున్నారు. అందుకే ఇక్కడ శవాలను బయటే ఉంచుతున్నట్లు చర్చసాగుతోంది. గత గురువారం కూడా ఒక శవాన్ని కట్టపై పడేయడం చూసిన పలువురు అయ్యో అంటూ నిట్టూర్చారు. కానీ ఇంత జరుగుతున్నా అక్కడే ఉండే వైద్యాధికారులు, డాక్టర్లు, సిబ్బంది కనీసం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శలు వినిపిస్తున్నాయి.

పర్యవేక్షణ అధికారుల వితండవాదన

మార్చురీ ఘటనలపై పర్యవేక్షణ వైద్యాధికారులు వితండవాదనలు వినిపిస్తున్నారు. ఆరు ఫ్రీజర్లు పని చేస్తున్నాయని ఆస్పత్రి పర్యవేక్షణ అధికారులు అంటున్నారు. అయితే డాక్టర్ల మాత్రం ఈ వ్యవహారం తమ పరిధికాదని తప్పించుకుంటున్నారు. ఎంఎన్‌ఓలు, ఇతర సిబ్బంది డబ్బులు తీసుకున్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామంటున్నారు. డాక్టర్లను పర్యవేక్షించే మరో అధికారి మాత్రం శవాలకు కట్టకట్టడానికి వస్త్రం, వాసన రాకుండా ఉండటానికి కెమికల్స్ ఆస్పత్రి నుంచి సరఫరా చేయాలని అది చేయడంలేదని వాటికోసం తీసుకోవాల్సి వస్తోందని తమ సిబ్బంది చెబుతున్నట్లు పేర్కొన్నారు.

ఆ డాక్టర్లు మాపరిధిలో ఉండరు



పోస్టుమార్టమ్ చేసే డాక్టర్లు మాపరిధిలో ఉండరు. వైద్యకళాశాల ప్రిన్సిపాల్ వారిని పర్యవేక్షించాల్సి ఉంటుంది. పోస్టుమార్టమ్ సమయంలో ఎంఎన్‌ఓలు, ఇతర నాలుగోతరగతి ఉద్యోగులు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే మాదృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకొని ఉద్యోగాల నుంచి తొలగిస్తాం. మార్చురీలో ఫ్రీజర్లు పని చేస్తున్నాయని రెండురోజుల కిందట కూడా చెప్పారు. బాలింతల వార్డులో దందాపైనా విచారిస్తా. బాధ్యులపై చర్యలు తీసుకుంటా.
- డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్

వస్త్రం, కెమికల్స్ కోసమేనట



మార్చురీలో పోస్టుమార్టమ్ కోసం డాక్టర్లు డబ్బులు తీసుకుంటున్నారనే ఫిర్యాదులు మాదృష్టికి వచ్చాయి. ఇటీవల జరిగిన ఓ ఘటన కలెక్టరు వరకు వెళ్లింది. దీనిపై విచారణ చేయగా మృతదేహం ప్యాకింగ్‌కు వస్త్రం, కెమికల్స్ కోసం డబ్బు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇవి ఆస్పత్రి సూపరింటెండెంట్ ద్వారానే తెప్పించి ఇవ్వాలి, కానీ వారు సరఫరా చేయడం లేదంటున్నారు. ఇదే విషయం కలెక్టరుకు నివేదించాం.
- డాక్టర్ మాణిక్యాలరావు, వైద్యకళాశాల ప్రిన్సిపాల్

బాలింతల వార్డులోనూ దందా

జిల్లా ఆస్పత్రిలోని బాలింతల వార్డులోను దందా సాగుతోంది. ఎఫ్ఎన్‌ఓలు ధర పెట్టి బాలింతల బంధువుల నుంచి డబ్బులు గుంజుతున్నారు. ఆడబిడ్డ అయితే రూ.1000లు, మగబిడ్డ పుడితే రూ.2వేలు గుంజుతున్నారని బాలింతల కుటుంబ సభ్యులు బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. బాలింతకు చీరమార్చినందుకు రూ100లు, బెడ్డు మార్చినందుకు రూ.200లు ప్రకారం కొందరు ఎఫ్ఎన్‌ఓలు తీసుకుంటున్నారని చెబుతున్నారు. ఈ వ్యవహారంపై పర్యవేక్షణ అధికారులకు ఫిర్యాదు చేసినా ఏం చర్యలు ఉండటం లేదు. ఎఫ్ఎన్‌ఓలకు డ్యూటీలు వేసేదే అధికారులన ప్పుడు ఇంక ఎలా చర్యలు తీసుకుంటారనే విమర్శలు ఉన్నాయి. కొందరు డాక్టర్లు తమ అక్రమ వ్యవహారాలన్నీ ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓలతోనే సాగిస్తుంటారని అందుకే వారి అక్రమాలపై చూసీచూడనట్లు ఉంటారన్న ప్రచారం సాగుతోంది.


జిల్లా ఆస్పత్రిలోని బాలింతలు ఉంటున్న లేబర్‌వార్డు

ఉద్యోగోన్నతి ఉండదా..!

- గ్రేడ్-4 సెక్రటరీలకు అన్యాయం
- ఎనిమిదేళ్లుగా ప్రమోషన్లు లేవు


డీపీఓ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 10: జిల్లాలో గ్రేడ్-4 పంచాయతీ సెక్రటరీలుగా పని చేస్తున్న వారు అర్హత ఉన్నా ఉద్యోగోన్నతికి నోచుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వారిపాలిట శాపంగా మారింది. జిల్లాలోని 31 మండలాల్లో గ్రేడ్-4 పంచాయతీ సెక్రటరీలుగా 497 మంది పనిచేస్తున్నారు. వీరికి 2016కు ముందు సీనియార్టీ జాబితా తయారుచేసి ఉద్యోగోన్నతులు కల్పించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ సీనియార్టీ జాబితా తయారు చేయని కారణంగా అర్హత ఉన్నా ఉద్యోగోన్నతికి నోచుకోలేదు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో పలువురు కొత్తగా గ్రేడ్-4 పంచాయితీ సెక్రటరీలుగా ఎంపికయ్యారు. కానీ పాతవారికి మాత్రం ఎనిమిదేళ్లుగా ఉద్యోగోన్నతి కల్పించడంలేదు.

మోక్షం ఎన్నడో..

ఇప్పటి వరకు గ్రేడ్-1 కార్యదర్శుల సీనియార్టీ జాబితా తయారు చేసి, అందుకు అనుగుణంగా అర్హులకు ఈఓఆర్డీలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. అనంతరం గ్రేడ్-2 సెక్రటరీలకు కూడా ఉద్యోగోన్నతి కల్పించి గ్రేడ్-1 సెక్రటరీలుగా నియమించారు. ఇక గ్రేడ్-3, గ్రేడ్-4 సెక్రటరీల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ సమస్య గురించి ప్రశ్నిస్తే.. జిల్లా పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉందని చెబుతున్నారు. తగిన సంఖ్యలో గుమాస్తాలు లేకపోవడం, ఉన్న వారు వ్యక్తిగత కారణాలరీత్యా దీర్ఘకాలిక సెలవుల్లో ఉండటంతో అధికారులు ఏ పని చేపట్టాలన్నా ఒక అడుగు ముందుకు వేస్తే మూడు అడుగులు వెనక్కు అన్న చందంగా పరిస్థితి మారుతోంది. జిల్లా మొత్తం 31 మండలాల్లో పని చేసే సిబ్బంది వ్యవహారాలు చూడడానికి జిల్లా పంచాయతీ కార్యాలయంలో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్స్, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్స్ ఉన్నారు. వీరందరూ పరిపాలన సౌలభ్యానికి సంబంధించిన వ్యవహారాలు చూసుకోవడానికే పరిమితమౌతున్నారు. ఇక సిబ్బంది సంక్షేమం గురించి ప్రత్యేకంగా పట్టించుకోనే తీరిక వారికి లేకపోవడంతో గ్రేడ్-4 పంచాయతీ సెక్రటరీల ఉద్యోగోన్నతులకు మోక్షం కనిపించడంలేదు. సీనియార్టీ జాబితా తయారీకి ప్రత్యేక సిబ్బందిని కేటాయించి న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అవగాహన ఉన్నా..

జిల్లా పంచాయతీ అధికారిగా ఇతర డిపార్ట్‌మెంట్ల నుంచి డెప్యుటేషన్‌పై వచ్చిన వారే ఎక్కువగా ఉంటున్నారు. గడిచిన నాలుగేళ్లుగా సొంత డిపార్ట్‌మెంట్ వారే జిల్లా పంచాయతీ అధికారిగా ఉన్నా, సిబ్బంది సంక్షేమం గురించి ఆలోచించలేదన్న విమర్శ ఉంది. డీఎల్‌పీఓలుగా ఉన్నవారు ఇన్‌చార్జి డీపీఓలుగా ఉంటున్నారు. ప్రస్తుత డీపీఓ ప్రభాకర్ రావు కూడా ఇక్కడికి ఇన్‌చార్జి డీపీఓగానే వచ్చారు. ఆ తరువాతే ఉద్యోగోన్నతి పొందా రు. ఆయనకు శాఖాపరంగా అన్ని అంశాల్లో పట్టు ఉంది. కానీ సిబ్బంది సంక్షేమంపై దృష్టి సారించలేదన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు.

న్యాయం చేస్తాం..



ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియార్టీ జాబితా తయారు చేయించాలి. ఇదో పెద్ద ప్రక్రియ. ఇప్పటికే కొన్ని కేటగిరీలకు పూర్తి చేశాం. అందుకు అనుగుణంగా ఉద్యోగోన్నతులను కల్పించాం. ఇంకా కొన్ని కేటగిరీల వాళ్లు ఉన్నారు. వారికి సీనియార్టీ జాబితా తయారు చేయాలి. ఇప్పటి వరకు ఎంతవరకు పూర్తి అయిందన్న వివరాలు పరిశీలించి, ఆ ప్రక్రియను కూడాపూర్తి చేసి వారికి ఉద్యోగోన్నతి కల్పిస్తాం. - ప్రభాకర్‌రావు, డీపీఓ

జైహనుమాన్

మార్మోగిన అంజన్న నామస్మరణం


కసాపురంలో శేష వాహనంపై ఊరేగుతున్న స్వామివార్లు

గుంతకల్లు/ డీ.హీరేహాళ్/ బొమ్మనహాళ్, ఆగస్టు 10: శ్రావణ మాసం తొలి శనివారం సందర్భంగా ఆంజనేయ స్వామి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన కసాపురం, నేమకల్లు, మురడి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జామునే స్వామి వారి మూల విరాట్టుకు అభిషేకాలు చేశారు. ఆభరణాలు, పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు ఆలయాల్లో హనుమానాచాలీసా, సుందరకాండ పారాయణం చేశారు. కసాపురంలో సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను అలంకరించి శేష వాహనంపై ఆశీనులనుగావించి ఊరేగించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు ఇతర వాహనాలలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి, స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలలో ఆలయ అర్చకులు, ఈఓలు, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అలంకారాలలో నెట్టికంటి ఆంజనేయుడి విరాట్టు, ప్రత్యేక అలంకరణలో మురడి ఆంజనేయస్వామి


వెండి కవచం, పుష్పాలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

వైసీపీ నాయకుడి ఇసుక దందా

- వేదవతి హగరి నుంచి భారీగా తరలింపు
- సెబ్, పోలీసు అధికారులకు ముడుపులు..?


తరలిపోతున్న ఇసుక



బొమ్మనహాళ్, ఆగస్టు 10: రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కొందరు అధికారుల్లో ఏమాత్రం మార్పు కనబడడం లేదు. వైసీపీ నేతలకు ఇంకా వంత పాడుతున్నారు. ఇసుక దందాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి అందినకాడికి దోచుకుంటున్నారు. బొమ్మనహాళ్ ప్రాంతంలో ఇసుక వ్యాపారమంతా వైసీపీకి చెందిన ఓ మండల పరిషత్ ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో జరుగుతోంది. ఆయన సివిల్, సెబ్ పోలీసు అధికారులతో అత్యంత సన్నిహితంగా ఉంటూ వేదవతి హగరిలో తవ్వగలిగినంత మేరకు ఇసుకను తవ్వేసి దోచేసుకుంటున్నాడు. బొమ్మనహాళ్ మండలం కళ్లుదేవనహళ్లి సమీపంలోని వేదవతి హగరి నది నుంచి ఇసుకను తవ్వి తన ట్రాక్టర్‌తోపాటు ఇతరుల ట్రాక్టర్లతో తరలిస్తున్నాడు. ఇసుక అక్రమ రవాణాతో కమీషన్ దందా కొనసాగిస్తున్నాడు. పాల్తూరు, విడపనకల్లు, ఉరవకొండ ప్రాంతాలకు నిత్యం ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు. అక్రమ రవాణాను ఆపాల్సిన పోలీస్ యంత్రాంగం పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ వ్యవహారంలో అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

ట్రాక్టర్‌కు రూ.1000

ఇసుక తరలింపునకు సహకరిస్తున్న కొందరు పోలీసులకు ట్రాక్టర్‌కు రూ.1000 ప్రకారం చెల్లించేలా వైసీపీ నాయకుడు ఒప్పందం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో అధికారులు అతని ట్రాక్టర్ల జోలికి వెళ్లడం లేదు. మిగిలిన వాటిని ఎప్పటికప్పుడు పట్టుకుంటున్నారు. రోజుకు పది ట్రాక్టర్లకుపైగా ఇసుకను తరలిస్తూ అక్రమార్జన గడిస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకునే పరిస్థితిలో లేరని టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. ఉచిత ఇసుక విధానంతో ప్రజలకు మేలు చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేలా వ్యవహరిస్తున్న వైసీపీ నాయకుడిపై, అతనికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా నూతన జేసీగా హరిత


హరిత

అనంతపురం టౌన్, ఆగస్టు 10: జిల్లా నూతన జాయింట్ కలెక్టరుగా డీ. హరిత నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న జేసీ ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్‌గా వెళ్లారు. ఆయన స్థానంలో హరితను ప్రభుత్వం నియమించింది. ఈమె 2018లో ఐఏఎస్ కన్ఫర్మ్ అయ్యారు. కడప, నెల్లూరు ఆర్డీఓగా పని చేశారు. అలాగే తిరుపతి, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లకు కమిషనర్‌గా కూడా పని చేశారు. గత నెలలో ఈమెను ఐటీడీఏకే, ఆర్‌పురం ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమించారు. అయితే అక్కడ ఆమె జాయిన్ కాలేదు. ఈక్రమంలోనే తాజాగా అనంత జిల్లా జాయింట్ కలెక్టరుగా నియమించారు. సోమవారం లేదా బుధవారం ఆమె బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని కలెక్టరేట్ వర్గాల సమాచారం.

17న ఎస్ఎంసీ ఎన్నికలు

అనంతపురం విద్య, ఆగస్టు 10: వాయిదా పడిన పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను ఈ నెల 17న నిర్వహించనున్నారు. ఈ నెల 8న జిల్లాలో 1,741 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. వివిధ కారణాలతో 29 పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. అక్కడ 17న ఎన్నికలను నిర్వహిస్తామని తెలియజేస్తూ ఆయా పాఠశాలలలో శనివారం నోటీస్ బోర్డులలో నోటిఫికేషన్‌ను ప్రదర్శించారు. 12న ఓటర్ల తుది జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, సరిచేసి తుది జాబితా ప్రకటిస్తారు. 17వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను సభ్యులు ఎన్నుకుంటారు. రెండు గంటలకు సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించి, మూడు నుంచి మూడున్నర గంటల్లోపు మొదటి సమావేశం నిర్వహిస్తారు.

ఇంటికో వ్యథ

'జగనన్న ఇళ్ల'కు రూ.35 వేలు చెల్లించిన లబ్ధిదారులు

- ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకుండా కాంట్రాక్టర్ పరారీ
- పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా పరిష్కారం కాని సమస్య
- న్యాయం చేయాలంటున్న బాధితులు

యాడికి, ఆగస్టు 10: మండలకేంద్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణం అంతులేని కథలాగా తయారైంది. 50మంది లబ్ధిదారులతో ఒక్కొక్కరితో రూ.35వేలు అదనంగా కట్టించుకున్న కాంట్రాక్టర్, అధికారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండా చేతులెత్తేశారు. ఆరునెలల నుంచి కాంట్రాక్టర్ జాడ లేకుండా పోవడంతో హౌసింగ్ లబ్ధిదారుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఇళ్లను తామే కట్టించి ఇస్తామని ప్రభుత్వం 3వ ఆప్షన్ ఇవ్వడంతో 120మంది లబ్ధిదారులు దీన్ని ఎంచుకున్నారు. అయితే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి అదనంగా రూ.35వేలు కాంట్రాక్టర్‌కు చెల్లించాలని అధికారులు చెప్పారు. అదనంగా డబ్బు చెల్లిస్తే నాణ్యతతో కూడిన ఇళ్లను నిర్మించి ఇస్తామని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులకు అదనంగా రూ.35వేలు కడితే సొంతింటి కల నెరవేరుతుందని లబ్ధిదారులు ఆశపడ్డారు. సొంతింటి కల నెరవేర్చుకోవడం కోసం అప్పులు చేసి మరీ రూ.35వేలను కాంట్రాక్టర్‌కు చెల్లించారు. ప్రారంభంలో పనులను చురుకుగా మొదలుపెట్టిన కాంట్రాక్టర్ ఆ తర్వాత చేతులెత్తేశాడు. ఇళ్ల నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టాడు.

నాసిరకంగా నిర్మాణాలు

కొన్ని ఇళ్ల పైకప్పులు ప్రారంభం కాకమునుపే కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని ఇళ్ల గోడలు అప్పుడే నెర్రెలు చీలాయి. ఇళ్ల నిర్మాణ పనులు ఎప్పటికప్పుడు నిలిచిపోతూ వచ్చాయి. దీనిపై లబ్ధిదారులు ధర్నాలు, ఆందోళనలు నిర్వహించారు. హౌసింగ్‌శాఖ జిల్లా అధికారులు వచ్చి భరోసా ఇచ్చినా నిర్మాణ పనులు మాత్రం కొనసాగలేదు. ప్రస్తుతం కాంట్రాక్టర్ కూడా లే ఔట్ వద్దకు రాకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. అధికారులు, కాంట్రాక్టర్ మాటలు నమ్మి తాము మోసపోయామని లబ్ధిదారులు గ్రహించారు. కాంట్రాక్టర్‌కు ఇచ్చిన సొమ్మునైనా వెనక్కి ఇప్పించాలని అధికారుల చుట్టూ తిరిగారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కూడా ఫిర్యాదు చేశారు. అయినప్పటికి హౌసింగ్ లబ్ధిదారులకు న్యాయం జరగలేదు. సుమారు 30 మంది లబ్ధిదారులకు కాంట్రాక్టర్ నేటివరకు సొమ్ము తిరిగి ఇవ్వలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.10లక్షలకు పైగా కాంట్రాక్టర్ చెల్లించాల్సి ఉందని లబ్ధిదారులు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అయినా ప్రజా ప్రతినిధులు, అధికారులు తగు చొరవ తీసుకొని తాము చెల్లించిన అదనపు డబ్బులను కాంట్రాక్టర్ నుంచి వెనక్కి ఇప్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


వంగిపోయిన ఇంటిపైకప్పు



కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు చేయడానికి వెళ్లిన లబ్ధిదారులు (ఫైల్)

వడ్డీకి తెచ్చి ఇచ్చా



సొంతింటి కల నెరవేరుతుందని అధికారులు చెప్పిన మాటలను నమ్మి వడ్డీకి డబ్బులు అప్పు తెచ్చి కాంట్రాక్టర్‌కు చెల్లించా. కాంట్రాక్టర్ ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయకుండానే వెళ్లిపోయాడు. తెచ్చిన అప్పుకు వడ్డీ పెరిగిపోయింది. ఇంటి నిర్మాణం పూర్తి కాలేదు. దీనిపై అనంతపురం వెళ్లి ఫిర్యాదుచేశాం. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాం. మాకు న్యాయం జరగలేదు. టీడీపీ ప్రభుత్వంలో అయినా మాకు న్యాయం జరిగేలా చూడాలి. - లక్ష్మీదేవి, హౌసింగ్ లబ్ధిదారురాలు, యాడికి

పేదల కడుపు కొట్టడం న్యాయమా?



రూ.35వేలు కడితే ఇల్లు కట్టించి ఇస్తామని చెప్పి మమ్మల్ని మోసం చేశారు. ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేయకుండానే కాంట్రాక్టర్ వెళ్లిపోయాడు. అధికారుల మాటలు నమ్మి పూర్తిగా మోసపోయాం. సమస్యను పరిష్కరించకుండా మాటను దాటవేస్తున్నారు. మాకు న్యాయం జరగదా? అప్పులు చేసి ఇచ్చిన మా డబ్బులను వెనక్కి ఇప్పించలేరా? పేదల కడుపు కొట్టడం న్యాయమా? మాకు న్యాయం చేయాలి.
- నాగూర్‌బీ, హౌసింగ్ లబ్ధిదారురాలు, యాడికి

ఎర్రకోట వేడుకలకు అనంత మెడికోలు



మెడికోలకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పరదేశీనాయుడు

అనంతపురం టౌన్, ఆగస్టు 10: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న ఢిల్లీ ఎర్రకోటలో నిర్వహించే వేడుకలకు అనంత మెడికోలు ఎంపికయ్యారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఏ.జీ పరిణితి సాయి, కె.హర్షశ్రీవిష్ణు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు శనివారం తెలిపారు. వైద్యకళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా ఈ విద్యార్థులు చేపట్టిన సమాజసేవా కార్యక్రమాలు, మేరీ మిట్టి మేరా దేశ్, అమృతవాటిక, రక్తదానం, మొక్కలు నాటే కార్యక్రమం, అవయవదానం, కూచిపూడి, భరతనాట్యం, శాస్త్రీయ సంగీతం తదితర అంశాలలో ప్రావీణ్యతను గుర్తించి ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ నరసింహం, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి వీరిని స్వాతంత్ర వేడుకలకు ఎంపిక చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 20మందిని ఎంపికచేయగా అందులో అనంత వైద్యకళాశాల నుంచి ఇద్దరు మెడికోలు ఉండటం ఆనందకరమన్నారు. ఈ విద్యార్థులు ఈనెల 11న ఢిల్లీకి వెళ్లి రాష్ట్రపతిభవన్ దగ్గర ఇంటర్నేషనల్ యూత్ హాస్టల్స్‌లో 13,14,15వరకు మూడురోజులు ఆతిథ్యం తీసుకుంటారన్నారు. ఢిల్లీలోని ప్రసిద్ధ ప్రదేశాలను చూపిస్తూ, ఆగస్టు 15న జరిగే వేడుకలలో స్పెషల్‌గ్యాలరీలో ప్రత్యేక ఆహ్వానితులుగా కూర్చోబెట్టి సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించే అవకాశాన్ని అక్కడి అధికారులు కల్పిస్తారని వెల్లడించారు. అనంతరం ఉపరాష్ట్రపతి భవన్‌లో జరిగే విందుకు హాజరవుతారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇంతటి అవకాశం రావడానికి కృషి చేసిన ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ పరదేశీనాయుడు, వేడుకలకు ఎంపికైన మెడికోలను ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు అభినందించారు.

దుర్గం విద్యార్థిని...



శ్రీలతకు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్

కళ్యాణదుర్గంరూరల్: ఢిల్లీలోని ఎర్రకోటలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనే అవకాశం ఎస్వీజీఎం డిగ్రీ ప్రభుత్వ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జయరాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్ శ్రీలత ఎర్రకోటలో జరగనున్న మార్చ్‌పాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొననుందన్నారు. ఈ సందర్భంగా శ్రీలతను ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రవిశంకర్, కళాశాల సిబ్బంది అభినందించారు.

గంపమల్లయ్యకు తొలి పూజలు



గుహలోని వెళ్తున్న పూజారి

శింగనమల, ఆగస్టు 10: శ్రావణమాసం తొలి శనివారం ప్రసిద్ధి గాంచిన గంపమల్లయ్య మునీశ్వర్‌కు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ పూజారి గుహలో ప్రవేశం సన్నివేశాలను తిలకించడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మండలంలో ఓ కొండ మీద గుహలో వెలసిన గంపమల్లయ్య మునీశ్వర్ స్వామికి ప్రతి ఏటా శ్రావణ మాసంలో నాలుగు వారాలు భక్తులు మొక్కులు చెల్లిస్తారు. గంపమల్లయ్యస్వామి పూజారి శ్రావణమాసం ప్రతి శనివారం స్వామి వెలసిన చిన్న గుహలోనికి దిగి పూజలు చేయడం ప్రత్యేకత. అయితే 2022లో శ్రావణ మాస పూజల సమయంలో కొండ నుంచి గుహలోనికి ప్రవేశించే సమయంలో పూజారి అదుపు తప్పి జారిపడి మృతి చెందాడు. అప్పటి నుంచి మూడు సంవత్సరాలు పాటు పూజారి కుటుంబ సభ్యులు ఎవరు గుహ ప్రవేశం చేయలేదు. ఈసారి మళ్లీ పూజారి కుటుంబ సభ్యులే గుహ ప్రవేశం చేయడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కొండమీద గంపమల్లయ్యకు పూజలు చేస్తున్న పూజారి

త్యాగాలే స్ఫూర్తిగా నడవండి

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలి

విద్యార్థులు నాలెడ్జ్ రీడర్స్‌గా కాకుండా ప్రొడ్యూసర్స్‌గా ఎదగాలి

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



నగరంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 10: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరుల త్యాగాలే స్ఫూర్తిగా నేటి విద్యార్థులు ప్రగతిబాటలో నడవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. హర్‌ఘర్ తిరంగా నినాదంతో బీజేపీ యువమోర్చా ఈ నెల 13నుంచి 15వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా కార్యక్రమాన్ని తలపెట్టింది. ఇందులో భాగంగా శనివారం యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వంశీ ఆధ్వర్యంలో లలితకళా పరిషత్‌లో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా క్లాక్ టవర్ నుంచి లలిత కళాపరిషత్‌వరకు నిర్వహించిన ర్యాలీని మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, హర్‌ఘర్ తిరంగా రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి గౌరవించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. స్వాతంత్ర్యం రాక ముందు కంటే వచ్చిన తరువాత చేసిన బలిదానాలు ఎక్కువన్నారు. స్వార్థ రాజకీయాల కోసం మత ప్రాతిపదికన అఖండ భారతదేశాన్ని హిందూ, ముస్లిం దేశాలుగా విభజించారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల కిందటి వరకూ దేశంలో అనేక ప్రాంతాల్లో బాంబుదాడులు జరిగి వందల మంది పౌరులు మరణించారన్నారు. అయితే ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో వాటిని నిలువరించి సురక్షిత భారతదేశంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి అనేక పథకాలు ప్రధాని మోదీ ప్రవేశపెట్టి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. గూగుల్, యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి ఎన్నో ప్లాట్‌ఫామ్‌లు ఇతర దేశాలు సృష్టించాయని అలాంటి వాటిని సృష్టించేలా ప్రతి విద్యార్థి వారి మేధస్సుకు పదును పెట్టాలని కోరారు. నాలెడ్జ్ రీడర్స్‌గా కాకుండా ప్రొడ్యూసర్స్‌గా ఎదగాలని సూచించారు. నర్సింగ్ కళాశాలల విద్యార్థులతో జాతీయ గీతాలాపన చేయించి జెండాను ఎగురవేయించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరీష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌లు గొంది అశోక్‌కుమార్, బీజేవైఎం అజేష్‌యాదవ్, సూర్యప్రకాష్, అశోక్‌రెడ్డి, మంజుల వెంకటేష్, ఎస్సీ మోర్చా శివశంకర్, శాంతకుమార్, ప్రభుకుమార్, ఓబీసీ మోర్చా నాగేంద్రకుమార్, ఎస్టీ మోర్చా రంజిత్ నాయక్, కిసాన్‌మోర్చా తిమ్మారెడ్డి, అసెంబ్లీ కోకన్వీనర్ అంజిబాబుతోపాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రైతు ఆత్మహత్య



ఆదినారాయణ (ఫైల్)

పామిడి, ఆగస్టు 10: అనంతపురం జిల్లా పామిడి మండల కేంద్రానికి చెందిన రైతు ఆదినారాయణ(39) అప్పుల బాధతో శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని తలవాలకట్ట వీధిలో ఉంటున్న ఆదినారాయణకు రెండు ఎకరాల పొలం ఉంది. మరో నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకున్నాడు. పత్తి, వరి సాగు చేసేవాడు. మూడేళ్లుగా పంటలు సక్రమంగా పండకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. రూ.10 లక్షల వరకూ అప్పులు పేరుకుపోయాయి. దిక్కుతోచని స్థితిలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. ఆదినారాయణకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చీనీమొక్కల కోసం ఉద్యాన క్షేత్రానికి వెళ్లండి

ఉద్యాన శాఖాధికారి అమరేశ్వరి

ధర్మవరం రూరల్, ఆగస్టు 10: మండలంలోని చిగిచెర్ల గ్రామంలో ఉన్న హార్టికల్చర్ ఉద్యాన క్షేత్రంలో వేరుకుళ్ల తెగుళ్లకు తట్టుకునే రంగాపూర్‌నిమ్మమీద అంటుకట్టిన చీనీమొక్కలు అందుబాటులో ఉన్నాయని ధర్మవరం ఉద్యానశాఖా ధికారి అమరేశ్వరి శనివారం తెలి పారు. ప్రస్తుతం ఉద్యానవనంలో చీనీమొక్కలకు అంటుకడుతున్నట్లు రు. ఈ రకం చీనీమొక్కలకు తెగుళ్ల బారిన పడకుండా తట్టుకునే శక్తి ఉంటుందన్నారు. ఒక్కో మొక్క రూ.60 ప్రకారం రైతలకు అందజేస్తు న్నట్లు అధికారి తెలిపారు. చీనీ మొక్కలు కావాల్సిన రైతులు చిగిచెర్ల ఉద్యాన క్షేత్రానికి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్లాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబరు 9121298862కు సంప్రదించాలని ఆమె తెలిపారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, ఆగస్టు 10: వారాంతపు సెలవులు, స్వాతంత్ర్య దినోత్సవ హాలిడేను పురస్కరించుకుని గుంతకల్లు మీదుగా తిరుపతికి ఆరు ట్రిప్పుల ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి-నాగర్‌సోల్ ప్రత్యేక రైలు (నెం. 07417) ఈనెల 14వ తేదీ ఉదయం 8-15 గంటలకు తిరుపతిలో బయలుదేరి మధ్యాహ్నం ఒకటిన్నరకు గుంతకల్లుకు చేరి, మరుసటి రోజు ఉదయం 10 గంటలకు నాగర్ సోల్‌కు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07418) ఈనెల 15వ తేదీన నాగర్‌సోల్‌లో రాత్రి 10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 4-05 గంటలకు గుంతకల్లుకు చేరి రాత్రి పదిన్నరకు తిరుపతికి చేరుతుందన్నారు. ఈరైలు రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, యర్రగుంట్ల, ముద్దనూరు, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, యాద్గిర్, చిట్టాపూర్, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాదు, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, నాందేడ్, పూర్ణా, పర్బని, సేలు, జల్నా, ఔరంగాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. అలాగే తిరుపతి-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (నెం. 07489) ఈనెల 17వ తేదీన తిరుపతిలో సాయంత్రం 5-15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7-25 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07490) ఈనెల 18వ తేదీన సికింద్రాబాదులో సాయంత్రం 6-10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9-15 గంటలకు తిరుపతికి చేరుతుందని వివరించారు. ఈనౌలే రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, చిట్టాపూర్, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి స్టేషన్ల మీదుగా సికింద్రాబాదుకు వెళ్తుందన్నారు. అలాగే తిరుపతి-నాందేడ్ ప్రత్యేక రైలు (నెం. 07417) ఈనెల 19వ తేదీన తిరుపతిలో సాయంత్రం 5-15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం ఒకటిన్నరకు నాందేడ్‌కు చేరుకుంటుందని తెలియజేశారు. ఈరైలు రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాద్, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, ముడ్‌ఖేడ్ స్టేషన్ల మీదుగా గమ్యం చేరుతుందని తెలిపారు.

గుత్తి మీదుగా ప్రత్యేక రైలు

కాచిగూడ-తిరుపతి ప్రత్యేక రైలు (నెం. 07653) ఈనెల 14, 16 తేదీల్లో కాచిగూడలో రాత్రి పదిన్నరకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10-25 గంటలకు తిరుపతికి చేరుతుందని, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07654) ఈనెల 15, 17 తేదీల్లో తిరుపతిలో సాయంత్రం 7-50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం తొమ్మిదిన్నరకు కాచిగూడకు చేరుకుంటుందని తెలిపారు. ఈరైలు ఉమ్దానగర్, షాద్‌నగర్, జడ్చెర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, యర్రగుంట్ల, కడప, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

నెట్టికంటి సన్నిధిలో జైళ్ల శాఖ రాయలసీమ డీఐజీ



నెట్టికంటి సన్నిధిలో పూజలు చేస్తున్న జైళ్లశాఖ డీఐజీ వరప్రసాద్

గుంతకల్లు, ఆగస్టు 10: జైళ్లశాఖ రాయలసీమ, గుంటూరు రేంజి డీఐజీ ఎంఆర్ వరప్రసాద్ శనివారం కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి సన్నిధిలో పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన డీఐజీని సాదరంగా ఆహ్వానించి స్వామివారి దర్శనం కల్పించారు. నెట్టికంటి సన్నిధిలో నామార్చనలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం శాలువతో సన్మానం చేసి, ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో గుత్తి జైలు మహేశ్వరుడు, తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ. 23

అనంతపురం రూరల్, ఆగస్టు 10: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శనివారం 3,750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.16, కనిష్ఠ ధర రూ.9 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 10: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలు, కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 512టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నిండుకుండలా తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్, ఆగస్టు 10: తుంగభద్ర జలాశయం నిండుకుండలా ఉంది. 1633 అడుగులతో 105 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో శనివారం సాయంత్రానికి నాటికి 1633 అడుగులతో 105 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర జలాశయానికి వరదనీరు వచ్చి చేరుతోంది. 40,925 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి చేరుతోంది. దీంతో 10 క్రస్ట్‌గేట్లు ఒక్క అడుగు మేర ఎత్తి నది 20,119 క్యూసెక్కులు, 15,370 క్యూసెక్కులు నీటిని కాలువలకు వదులుతున్నారు. బొమ్మనహాళ్ సరిహద్దులోని హెచ్చెల్సీ 105వ కి.మీ. వద్ద 1310 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

జీడిపల్లికి ఇన్‌ఫ్లో 112 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఆగస్టు 10: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం 112 క్యూసెక్కుల కృష్ణాజలాల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటి నిల్వ 0.263 టీఎంసీలు ఉందన్నారు.

ఒక్కడికే ఐదు ఉద్యోగాలు

యాడికి యువకుడిని వరించిన బ్యాంకు కొలువులు



జయకృష్ణ

యాడికి, ఆగస్టు 10: ఒక్క ప్రభుత్వ ఉద్యోగమే రావడం కష్టమైన నేటి రోజుల్లో యాడికికి చెందిన ఓ చేనేత కార్మికుడి కుమారుడు ఏకంగా ఐదు బ్యాంకు ఉద్యోగాలు సాధించాడు. మండలకేంద్రానికి చెందిన పూజారి తిరుపతయ్య కుమారుడు జయకృష్ణ ఇటీవల ఆర్బీఐ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈయన 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు యాడికి ప్రభుత్వ హైస్కూల్‌లో చదివాడు. 2012-2013 పదో తరగతి పూర్తి కాగా ఆర్డీటీ సహకారంతో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాడు. అనంతపురం, నంద్యాలలో బ్యాంక్ కోచింగ్ తీసుకొని వివిధ బ్యాంకుల్లో ఐదు ఉద్యోగాలు సాధించాడు. 2022లో సౌత్ ఇండియన్ బ్యాంక్ హైదరాబాద్, 2024లో కర్ణాటక గ్రామీణ బ్యాంక్ కర్ణాటక, కెనరా బ్యాంక్ కర్ణాటక, ఎస్‌బీఐ కర్ణాటకలో ఉద్యోగాలు సాధించాడు. ప్రస్తుతం రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బెంగళూరు శాఖలో అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. చేనేత కార్మికుడి కుమారుడు జయకృష్ణ ఇలా వరుసగా ఐదు బ్యాంక్ ఉద్యోగాలు సాధించడంపై స్థానికులు అభినందించారు.

జన హితమే 'వదాన్య' లక్ష్యం

ఇద్దరు ఇంజనీర్ల ఆలోచనల రూపం వదాన్య జన సొసైటీ

ఎంతోమంది విద్యార్థుల ఉన్నత చదువులకు చేయూత

ప్రభుత్వ ఉద్యోగ సాధనలో యువతకు బాసట

సాంకేతికతతో ముందుకు సాగడానికి ల్యాప్‌టాప్‌ల పంపిణీ

18న సొసైటీ వార్షికోత్సవానికి సన్నద్ధం



ప్రభుత్వ పాఠశాలలో టాలెంట్ టెస్టు (ఫైల్)



2023లో నిర్వహించిన టాలెంట్ టెస్టుకు హాజరైన విద్యార్థులు




శ్రీ సత్యసాయి జిల్లా అప్పటి ఎస్పీ మాధవరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు లాప్‌టాప్‌లు అందజేస్తున్న అశోక్ పడపాటి (ఫైల్)

అనంతపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సమాజం పట్ల బాధ్యత కొందరికే ఉంటుంది. సమాజం మనకు ఏమిచ్చిందనేది కాదు. సమాజానికి మనమేమిచ్చామన్నదే వారి ఆలోచన. ఇలాంటి సేవా గుణం కలిగిన ఇద్దరు ఇంజనీర్ల మదిలో మెదిలిన ఆలోచనల రూపమే వదాన్య జన సొసైటీ. వీరు 2010లో వదాన్య జన సొసైటీని స్థాపించారు. ఆ సొసైటీ ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించారు. ఉన్నత చదువులకు భరోసానిచ్చారు. అంతేకాదు సామాజిక సేవల్లోనూ ఆ సంస్థ తనదైన ముద్ర వేసుకుంది. ఇంతకూ ఆ ఇద్దరు యువ ఇంజనీర్లు ఎవరంటారా..? శ్రీ సత్యసాయి జిల్లాలోని కొత్తచెరువుకు చెందిన అశోక్ పడపాటి ఒకరు కాగా... మరొకరు అతడి మిత్రుడు అరుణ్. సొసైటీ స్థాపించినప్పటి నుంచి సేవా కార్యక్రమాలు విస్తరిస్తూ, సమాజహితమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఈ నెల 18న సొసైటీ వార్షికోత్సవానికి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో... ప్రత్యేక కథనం.

రెండు తెలుగు రాష్ట్రాల్లో సేవలు...

రాష్ట్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో సొసైటీ ఏర్పాటైంది. అప్పటి నుంచి ఆ సొసైటీ నిరుపేద, నిరాశ్రయ, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థికంగానూ, మానసికంగానూ తోడ్పాటునందిస్తోంది. రాష్ట్ర విభజన జరిగినా రెండు తెలుగు రాష్ట్రాల్లో సొసైటీ సేవలందిస్తోంది. నిరుపేద విద్యార్థులకు ఆపన్నహస్తం అందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. సొసైటీ ప్రారంభంలో హైదరాబాదులో కార్యకలాపాలను కొనసాగించినా ఆ తరువాత రెండు రాష్ట్రాల్లోనూ సేవలను విస్తృతం చేసింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో మరింత పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు సొసైటీ ద్వారా ఉన్నత విద్యావంతులతో ప్రత్యేక క్లాసులకు శ్రీకారం చుట్టింది. ఆ విధానాన్ని కొనసాగిస్తూనే ఆర్థికభారంతో పేద విద్యార్థుల చదువులు ఆగిపోకూడదనే లక్ష్యంతో ఉన్నత చదువుల కోసం ఆర్థిక చేయూతనందిస్తోంది. సాంకేతికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో లాప్‌టాప్‌లను ఉచితంగా అందజేసింది. సొసైటీ ద్వారా పోటీ పరీక్షలను నిర్వహించి ఎందరో విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు మార్గం సుగమం చేసింది. ఇప్పటివరకూ దాదాపు 300 మంది విద్యార్థులకు ఆ మేరకు సహాయసహకారాలు అందించారు. 50 మందికిపైగా లాప్‌టాప్‌లు అందించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడం కోసం టాలెంట్ టెస్టులను నిర్వహించడం సొసైటీ ప్రధాన ఉద్దేశ్యం. ఆ క్రమంలోనే ఆ సొసైటీ వ్యవస్థాపకులు అశోక్ పడపాటి నేతృత్వంలో అందులోనూ సొంతగడ్డ కొత్తచెరువులో గతేడాది గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో మరింత నైపుణ్యాన్ని పెంపొందించేందుకుగానూ టాలెంట్ టెస్టులు నిర్వహించింది. ఈ టాలెంట్ టెస్టులో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులు ప్రస్తుతం హైదరాబాదులో ఐఐటీ శిక్షణ అందుకుంటున్నారు. సామాజికసేవలోనూ సొసైటీ తన పాత్రను పోషిస్తోంది. కరోనా సమయంలో ఆర్డీటీ సంస్థకు చేయూతనందించింది. ఆక్సిజన్ కొరతతో ఎవరూ చనిపోకూడదనే లక్ష్యంతో సిలిండర్లను ఆర్డీటీకి అందించి దాతృత్వాన్ని చాటుకుంది.

సేవలను మరింత విస్తృతం చేస్తాం: అశోక్ పడపాటి



ఉమ్మడి అనంతపురం జిల్లాలో వదాన్య జనసొసైటీ ద్వారా సేవలను మరింత విస్తృతం చేస్తాం. కరువు పరిస్థితులను దృష్టి లో ఉంచుకొని పేద విద్యార్థులను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా కార్యాచరణ ను రూపొందిస్తున్నాం. డీఎస్సీ నోటిఫికేషన్‌ను దృష్టిలో ఉంచుకొని త్వరలో డీఎస్సీ గ్రాండ్ టెస్టు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాం. ఉమ్మ డి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 2024 టాలెంట్ టెస్టును ఓఎంఆర్ విధానంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ స్టైఫండ్‌తో పాటు వారు ఏ రంగంలో శిక్షణ కావాలంటే అందులో శిక్షణ ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నాం.

శాస్త్రీయ పద్ధతిలోనే వ్యర్థాలను డిస్పోజ్ చేయాలి

● ప్రైవేట్ ఆస్పత్రులకు డీఎంహెచ్ఓ ఆదేశం



యశోదా ఆస్పత్రి సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

అనంతపురం టౌన్, ఆగస్టు 10: శాస్త్రీయ పద్ధతిలోనే బయోమెడికల్ వ్యర్థ పదార్థాలను డిస్పోజ్ చేయాలని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి ఆదేశించారు. శనివారం నగరంలోని యశోదా ఆస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రి నిర్వహణ, వ్యర్థపదార్థాలు ఎలా డిస్పోజ్ చేస్తున్నారు తదితర విషయాలను ఆరాతీసి పరిశీలించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ వ్యర్థపదార్థాలు సక్రమంగా డిస్పోజ్ చేయడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రతి ప్రైవేట్ ఆస్పత్రి వ్యర్థ పదార్థాలను బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అనుసంధానమై శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థపదార్థాలను డిస్పోజ్ చేయాల్సిందేనన్నారు. అందులో వేసిన వ్యర్థపదార్థాలను బయోమెడికల్ డిస్పోజల్‌ప్రాంతానికి ఒప్పందం ప్రకారం పంపించాలని సూచించారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు ఆయా ఆస్పత్రులపై తీసుకుంటామని డీఎంహెచ్ఓ హెచ్చరించారు. కార్యక్రమంలో డెమో త్యాగరాజు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు బదిలీ చేయండి



కేంద్రమంత్రి పెమ్మసానిని కలిసిన పంచాయతీరాజ్ చాంబర్ సభ్యులు

శింగనమల ఆగస్టు 10: రాష్ట్రంలో 15వ ఆర్థిక నిధులను పంచాయతీలకు బదిలీ చేయాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ సభ్యులు విన్నవించారు. శనివారం గుంటూరులోని కేంద్ర మంత్రి కార్యాలయంలో పంచాయతీ నిధులపై పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి, శ్రీనివాసులు కలసి కేంద్ర మంత్రికి విన్నవించారు. వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో 15వ ఆర్థిక సంఘం రూ.10441 కోట్ల నిధులను పంచాయతీ అభివృద్ధికి కాకుండా దారి మళ్లించారు. దాంతో పంచాయతీలు అభివృద్ధి జరగలేదని, ఇప్పటికైనా ఆ నిధులను పంచాయతీలకు బదిలీ చేయాలని వారు కోరారు. రామకృష్ణ, ధనుంజయ, నిట్టూరు, శివాజీ, విజేత, లక్ష్మి, వసుధ పాల్గొన్నారు.

నాగులకు విశేష పూజలు



నాగుల కట్టకు పూజలు చేస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 10: శ్రావణమాసం తొలి శనివారాన్ని పురస్కరించుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లో నాగదేవతలకు విశేష పూజలు నిర్వహించారు. శారదానగర్‌లోని శివబాల యోగి ఆశ్రమం, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, అశోక్‌నగర్‌లోని హరిహర దేవాలయం, ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వర దేవాలయం, చెరువుకట్ట తదితర ప్రాంతాల్లోని నాగుల కట్టలు, పుట్టల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. నాగుల ప్రతిమలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించడంతోపాటు ఒకరికొకరు చేతులకు కంకణాలు కట్టుకుని, నాగదేవతలను స్థుతిస్తూ పుట్టలో పాలు పోశారు.

స్వాతంత్ర్య వేడుకలకు అనంత విద్యార్థులు



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శంకరయ్య

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 10: ఢిల్లీలో నిర్వహించనున్న స్వాతంత్ర్య వేడుకలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొనన్నారు. ఈ మేరకు కేఎస్ఎన్ ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల నుంచి స్వప్న, కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి శ్రీలత పాల్గొననున్నట్లు అయా కళాశాలల ప్రిన్సిపాల్స్ తెలిపారు. ఢిల్లీ ఎర్రకోటలో నిర్వహించే మార్చ్‌పాస్ట్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొంటారని ఈ విషయం జిల్లా ఖ్యాతిని పెంచుతోందని వారు పేర్కొన్నారు. అనంతరం ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు శంకరయ్య, జయరామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓలు మున్నీసా బేగం, రామకృష్ణ, రవిశంకర్, అధ్యాపకులు నాగిరెడ్డి, రాధాకృష్ణ, గురుమోహన్, సుధాకర్ విద్యార్థులను వేరువేరుగా అభినందించారు.

షకీల్ షఫికి మైనార్టీల శుభాకాంక్షలు



షకీల్‌షఫికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐఎంఎం నాయకులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 10: ముతవల్లుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫికి ముస్లిం మైనార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. వారం రోజుల ఉమ్రా యాత్రను ముగించుకుని శనివారం అనంతపురం చేరుకున్న ఆయనను ఐఎంఎం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, తూముచర్ల బాబా ఫక్రుద్దీన్, జాకీర్, సమీవుల్లా, షబ్బీర్, మౌలానా, కరీముల్లా పాల్గొన్నారు.

జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన జిల్లా బాలికల హ్యాండ్‌బాల్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 10: జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్ల వివరాలను జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, రఫీయుద్దీన్ ప్రకటించారు. ఎంపికైన బాలికల జట్టులో గీతాంజలి, వరలక్ష్మి, శారద, సుస్మిత, వీఎల్ స్వాతి, జూషిత, గురువర్షిణి, సి.స్వాతి, మాధవిలత, శ్రీహర్షిత, రక్షిత, కీర్తన, జోహోఫాతిమా, సాయిదీక్షిత, భారతి, సుమియాఫిర్దోస్ ఉన్నారు. బాలుర జట్టులో లింగ, ఈశ్వర్, అభిషేక్, జగదీష్, చక్రధర్‌నాయక్, బాలు, తరుణ్, పవన్‌కుమార్, నరసింహమూర్తి, సాయిచరణ్, దినేష్, ప్రవీణ్‌చంద్ర, సాయికుమార్, అహ్మద్‌తోఫిక్, అర్జున్, పవన్‌ప్రణీత్ ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు కదిరిలో 17వతేదీ నుంచి నిర్వహించే 46వ ఏపీ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. సంఘం జిల్లా కోశాధికారి అలీ, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజల సేవకే నా జీవితం అంకితం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్
● అట్టహాసంగా జన్మదిన వేడుకలు
● పార్టీ నాయకుల నుంచి శుభాకాంక్షల వెల్లువ

అనంతపురం అర్బన్, ఆగస్టు 10: ప్రజల సేవకే నా జీవితం అంకితమని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల నడుమ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. శనివారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కొందరు పుష్పగుచ్ఛాలు, పెన్నులు, పుస్తకాలు అందజేయగా.. మరికొందరు భారీ గజమాలలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య ఎమ్మెల్యే భారీ కేక్‌ను కట్ చేశారు. పలువురు నాయకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం చేసిన వారిని ఎమ్మెల్యే అభినందించారు. అనంతపురం అర్బన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్థానిక నాయకులు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతపురం ప్రభుత్వాస్పత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనపై ప్రజలు, కార్యకర్తలు చూపుతున్న అభిమానాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని, ఈ జీవితం ప్రజలకే అంకితమన్నారు. తనపై ఇంత అభిమానాన్ని చూపుతున్న కార్యకర్తలు, ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. సీఎం చంద్రబాబు సహకారంతో తనకు శక్తి ఉన్నంత వరకు ప్రజలు సేవ చేస్తానన్నారు. తన పుట్టిన రోజును పురష్కరించుకొని పర్యావరణ పరిరక్షణలో భాగంగా 10వేల మొక్కలు నాటుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ మేయర్ స్వరూప, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న, అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్యచౌదరి, రాయల్ మురళీ, నాయకులు గంగారామ్, కొండవీటి సుధాకర్ నాయుడు, కూచిహరి, తాజుద్దీన్, సుధాకర్ యాదవ్, చంటి, గుర్రం నాగభూషణం, దళవాయి వెంకటనారాయణ, విశాలాక్షి, జోగి రాజేంద్ర, రాంప్రసాద్, తమ్మినేని వేణుగోపాల్, రామకృష్ణ రాయల్, పీఎం లక్ష్మీప్రసాద్, కుంచెపు వెంకటేష్, నెట్టెం బాలకృష్ణ, సిమెంట్ పోలన్న పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న వైకుంఠం జయచంద్ర చౌదరి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, శుభాకాంక్షలు తెలుపుతున్న సుధాకర్‌నాయుడు, రాయల్ మురళి

10వ డివిజన్‌లో... : నగరంలోని 10వ డివిజన్‌లో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే దగ్గుపాటి జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు దూదేకుల బాబు, గోపాల్, కడియాల కొండన్న, కుమ్మర మధు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ఓంకార్‌రెడ్డి: ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌కు తెలుగు యువత నాయకుడు ఓంకార్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేకు గౌతమబుద్ధుడి ప్రతిమను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ, ఇస్మాయిల్, ఆది, ఇబ్రహీం, వలి, శ్రావణ్, మనోహర్, భాస్కర్ పాల్గొన్నారు.

పాతూరు ప్రభుత్వాస్పత్రి వద్ద అన్నదానం: ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ జన్మదినాన్ని పురష్కరించుకొని శనివారం స్థానిక పాతూరు ప్రభుత్వాస్పత్రి వద్ద టీడీపీ నాయకులు రవి కుమార్ రాయల్, చొప్ప రామకృష్ణ అన్నదానం చేశారు.

పడుచూరి శివకుమార్ శుభాకాంక్షలు: ఎమ్మెల్యేకు షిరిడిసాయి స్వీట్స్ అండ్ బేకర్స్ అధినేత పడుచూరి శివకుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పేద మహిళలకు చీరల పంపిణీ: ఎమ్మెల్యే పుట్టిన రోజును పురస్కరించుకొని శనివారం స్థానిక మున్నా నగర్‌లో టీడీపీ నాయకులు రమేష్ రాయల్, మధు రాయల్ ఆధ్వర్యంలో 500 మందికిపైగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గురుమూర్తి, రవికుమార్, రాము, తరుణ్, శ్రీదేవి, నిర్మల, వలి, మధు, రుషివర్ధన్, వినోద్, జిలాన్, సుదర్శన్, రేవంత్, శివ, బాబావలి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న గద్దం సుబ్రహ్మణ్యం, బాంబేడయింగ్ నాగన్న, సరిపూటి సూర్యనారాయణ, వడ్డే నాగార్జున



ఎమ్మెల్యేకు గౌతమబుద్దుడి ప్రతిమను అందజేస్తున్న ఓంకార్‌రెడ్డి



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న షిరిడి సాయి పడుచూరి శివకుమార్



10వ డివిజన్‌లో కేక్ కట్ చేస్తున్న పోతుల లక్ష్మీనరసింహులు, టీడీపీ నాయకులు



పాతూరు ప్రభుత్వాస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న రవికుమార్, రామకృష్ణ



రాయల్ మురళీ, చంటి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేపై రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న రమేష్ రాయల్, మధు రాయల్

కనులపండువగా ఏడు శనివారాల వ్రతం





పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లు, వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 10: ఏడుశనివారాల వ్రతాల్లో భాగంగా నాల్గవ శనివారం నగరంలోని పలు ఆలయాల్లో వ్రతాలను కనులపండువగా నిర్వహించారు. ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయం, రామ్‌నగర్ వెంకటేశ్వర దేవాలయం, అశోక్‌నగర్ సత్యనారాయణస్వామి దేవాలయం, శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, శివబాలయోగి ఆశ్రమం, వేణుగోపాల్ సద్గురు సాయినాథ మందిరాల్లో వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. పండితులు వ్రతవిశిష్టతను వివరిస్తుండగా భక్తులు సామూహికంగా వ్రతాలను ఆచరించారు.

అన్ని విభాగాలను బలోపేతం చేయండి: ఎస్పీ

అనంతపురం క్రైం,ఆగస్టు 10: పోలీస్ కంట్రోల్ రూంలో నిర్వహిస్తున్న అన్ని విభాగాలను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. శనివారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న పోలీస్ కంట్రోల్ రూం తదితర విభాగాలను ఆయన పరిశీలించారు. ఆయా విభాగాల పని తీరు, నిర్వహణపై సమీక్షించారు. వీటి నిర్వహణలో ఏవైనా లోటుపాట్లుంటే సరిచేయాలనే ఉద్దేశంతో ఎస్పీ సిబ్బందితో మాట్లాడారు. నగరంతో పాటు అన్ని మున్సిపల్ పట్టణాల్లోని శివారు ప్రాంతాలు కవర్ అయ్యేలా సీసీ కెమెరాలను సిద్ధం చేసి నిఘా ఉంచాలన్నారు. లాక్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్ పనితీరుపైనా ఎస్పీ ఆరా తీశారు. అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్పీ సీఐ ఇందిర, పోలీస్ కంట్రోల్ రూం సీఐ దేవానంద్, సైబర్ సెల్ సీఐ షేక్‌జాకీర్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

ధర్మవరం రూరల్(కనగానపల్లి), ఆగస్టు 10: మండలకేంద్రానికి చెందిన సాకే నాగేంద్ర అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో స్నేహితులు స్పందించారు. గ్రామానికి చెందిన బట్టారాజేష్ స్పందించి తన స్నేహితులతో కలిసి శనివారం సాకే నాగేంద్ర భార్య వరలక్ష్మికి రూ.10వేలు నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. సాకే నాగేంద్రకు ముగ్గురు ఆడపిల్లలతో పాటు ఆయన భార్య గర్భవతి కావడంతో స్నేహితులు బట్టా రాజేష్, బోయపాటి శ్రీకాంత్, అంకే హరి, బట్టా శివ, చిట్టిలతో కలిసి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరు ఆగస్టు 10: మండలంలోని వై కొత్తపల్లి గ్రామంలో శనివారం మైసూరు సర్వధర్మ ఆశ్రమ పీఠాధిపతులు మమతమ్మవరి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు, టీడీపీ నాయకులు రాజారమేష్, నాగన్న, గోపాల్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో ఫైనల్‌కు చేరిన జార్ఖండ్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 10: జాతీయ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో జార్ఖండ్ జట్టు ఫైనల్‌కు చేరింది. జాతీయ బాలకల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా శనివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో గ్రూప్-సీలో తమిళనాడు, జార్ఖండ్ రాష్ట్రాల మధ్య సెమీఫైనల్ నిర్వహించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో పాయింట్ తేడాతో తమిళనాడుపై గెలిచిన జార్ఖండ్ ఫైనల్‌కు చేరింది. ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఏపీ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి మల్లేష్, చల్లా శ్రీనివాస్, నవీన్‌కుమార్, శ్రవణ్, శ్రీనివాస, క్రీడాకారులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించండి

శింగనమల ఆగస్టు 10: మండలంలోని చిన్నజలాలపురం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి టీడీపీ నాయకుడు మెండిపోగుల ఎర్రిస్వామి విన్నవించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, డ్రైనేజీ అధ్వానంగా ఉందని ఎక్కడపడితే అక్కడ గుంతలో నీటి నిల్వ ఉండడంతో సీజనల్ వ్యాధులు వస్తున్నాయని ఆమె దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే స్పందించి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

సేంద్రియ వ్యవసాయమే శ్రేయస్కరం

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 10: సేంద్రియ వ్యవసాయసాగే రైతులకు శ్రేయస్కరమని రాయలసీమ వాటర్ ప్రాజెక్టు కో-ఆర్డీనేటర్ రవి, సేంద్రియ వ్యవసాయ కో-ఆర్డీనేటర్ సన్నప్పయ్య అన్నారు. మండలంలోని కనుముక్కల గ్రామంలో సేంద్రియ వ్యవసాయం, నీటివాడుక పద్ధతిపై రైతులకు శనివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూసారం పెంచుకునే పంచగవ్య, జీవామృతం, ఘన జీవామృతం తదితర రసాయనాల తయారీ గురించి రైతులకు శిక్షణలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యకర్తలు నారాయణస్వామి, ముత్యాలయ్య, కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్ హరినాథరెడ్డి, శ్రీకల్పన, రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిగురు ఆటల పండుగ

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 10: టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛందసంస్థ చిగురు ఆధ్వర్యంలో స్థానిక సీవైఆర్‌సీ ప్రాంగణంలో శనివారం చిగురు ఆటల పండుగను ఉత్సాహంగా నిర్వహించారు. ప్రతిఏటా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లలతో ఆటల పండుగను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కుర్చీల ఆట, స్కి ప్పింగ్, కప్పగంతులు, సంచుల ఆట తదితర పోటీలు నిర్వహించారు. రొద్దం, రామగిరి, చెన్నేకొత్తపల్లి, పెనుకొండ బాలల సంఘాలు, మిళిత సంఘాలు ప్రకృతి బడి పిల్లలు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏడీ సుకన్య, మేనేజర్ జయశ్రీ, కో ఆర్డీనేటర్లు రామన్న, అడవిరాముడు, అసోసియేట్స్ పూర్ణిమ, షారూన్ పాల్గొన్నారు.

గంపమలయ్య పూజారి కుటుంబ సభ్యుల బైండోవర్

శింగనమల ఆగస్టు 10: మండలంలో గంపమలయ్య కొండ వద్ద అనుమతులు లేకుండా గుహలో ప్రవేశించిన పూజారి కుటుంబ సభ్యులపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ చింతబరయ్య తెలిపారు. 2022లో గంపమలయ్య కొండ గృహ ప్రవేశ సమయంలో అప్పటి పూజారి అప్పా పాపాయ్య ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందారు. అప్పట్లో పోలీస్, రెవెన్యూ శాఖ కలసి శ్రావణ మా సంలో కొండ గుహ ప్రవేశాన్ని నిషేధించారు. ఈ ఏడాది శ్రావణ మాసం తొలివారంలో రెవెన్యూ, పోలీసులు అనుమతులు లేకుండా గుహ ప్రవేశానికి వెళ్లిన అప్పామునేంద్ర, అప్పాబాలు, అప్పా దేవరాజ్‌పై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పరిటాల సునీతను కలిసిన విద్యాకమిటీ సభ్యులు



పరిటాల సునీతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పాఠశాల కమిటీ సభ్యులు

ఆత్మకూరు ఆగస్టు 10: మండలంలోని వేపచెర్ల పాఠశాల విద్యా కమిటీ సభ్యులు శనివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజి, మండల కన్వీనర్ శ్రీనివాసులు, శశాంక చౌదరి, మారెక్క, అంజి, అక్కినారాయణ పాల్గొన్నారు.

రాప్తాడు: మండలంలోని మరూరు పాఠశాల కమిటీ చైర్మన్‌గా ఎంపికైన ఆదినారాయణ, వైస్ చైర్మన్ లక్ష్మీదేవి ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ధర్మవరపు మురళి, మరూరు గోపాల్, రైటర్ కదిరప్ప, నరేష్ పాల్గొన్నారు.

ఎంవీ రమణ కుమారుడికి పరామర్శ



వేణుతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

అనంతపురం విద్య, ఆగస్టు 10: సీపీఐ సీనియర్ నాయకుడు దివంగత ఎంవీ రమణ కుమారుడిని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పరామర్శించారు. రెండు రోజుల కిందట ఎంవీ రమణ మరణించిన విషయం తెలిసిందే. శనివారం కాలవ శ్రీనివాసులు రమణ ఇంటికి వెళ్లి....ఆయన కుమారుడు, లాయర్ వేణుగోపాల్, ఆయన కుటుంబికులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ....రమణ నీతి, నిబద్ధతకు మారుపేరన్నారు. ఎంతో మంది యువతకు, రాజకీయ నాయకులు ఆయన ఆదర్శంగా నిలిచారన్నారు. టీడీపీ నాయకులు ఆదినారాయణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి, నగర ప్రధానకార్యదర్శి కృష్ణుడు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినం



జెండా ఆవిష్కరణలో ఆ సంఘం నాయకులు

అనంతపురం విద్య, ఆగస్టు 10: యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం హౌసింగ్‌బోర్డులోని కార్యాలయం ముందు యూనియన్ పతాకాన్ని ఎగరవేశారు. జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ యాభై ఏళ్ల కిందే ఆగస్టు 10న యూటీఎఫ్‌కు బీజం పడిందన్నారు. ఉపాధ్యాయ, విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేస్తూ...యూనియన్ ముందుకెళుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవేంద్రమ్మ, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, నాగేంద్ర, పవన్‌కుమార్, ఆదిశేషయ్యకొండప్ప, మహమ్మద్ గౌస్, నారాయణ, వెంకట నాయుడు, గంగాధర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



ప్రజలనుంచి విరాళాలు సేకరిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 10: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో సంభవించిన వరదలకు నిరాశ్రయులైన బాధితులకోసం ఆర్ట్స్ కళాశాలల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విరాళాలు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో నగరంలోని పలు కార్యాలయాలు, కూడళ్లలో విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని విష్ణుప్రియ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను కలవడంతో స్పందించిన ఆయన రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. విద్యార్థులు ఊర్వశి, త్రిష్మిల, నందిని, తేజశ్విని, అమృత, శ్రావణి, సంతోష్, ఎర్రిస్వామి, వంశీ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి

● ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 10: ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం అనంతపురం డిపోలో నూతనంగా వచ్చిన సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులను ఎమ్మెల్యే పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే బస్సు ఎక్కి కొంతదూరం నడిపారు. ఆయన మాట్లాడుతూ... ప్రజల్లో ఆర్టీసీ పట్ల మంచి నమ్మకం ఉందని, ఆ నమ్మకాన్ని మరింత బలపర్చాలని సూచించారు. అనంతపురం డీఎం నాగభూపాల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాయల్ మురళి, క్రిష్టం రఘు, సుధాకర్ యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ లక్ష్మీనారాయణ, ఆర్టీసీ కార్మిక పరిషత్ నాయకులు వాసుదేవరెడ్డి, సదాశివరెడ్డి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

డిపోలో సమస్యలను పరిష్కరించండి: ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం డిపో పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అనంతపురం డిపో అధ్యక్షుడు సూరిబాబు డిమాండ్ చేశారు. శనివారం డిపోకు వచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను కలిసి ఎన్ఎంయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. సూరిబాబు మాట్లాడుతూ... బస్టాండు ఆవరణలో ప్రయాణికులు బస్సు దిగే ప్రాంతమంతా గుంతలమయమైందని, వర్షాకాలంలో వర్షపునీరు నిలిచి మరీ ఇబ్బందికరంగా ఉంటోందని, ఆ ప్రాంతానికి మరమ్మతులు చేయించాలని కోరారు. కాలం చెల్లిన ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల స్థానంలో కొత్తబస్సులు తెప్పించాలని కోరారు. డిపో కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ఉపాధి హామీ పనులు చేపట్టాలి

పామిడి, ఆగస్టు 10 : పామిడి పంచాయతీలోనూ ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని వామపక్ష పార్టీల నాయకులు శనివారం ప్రకటనలో కోరారు. 2011 వ సంవత్సరంలో పామిడి గ్రామ పంచాయతీ నగర పంచాయతీగా రూపాంతరం చెందాక 2012వ సంవత్సరం నుంచి ఉపాధి హామీ పథకం పనులు చేపట్టలేదన్నారు. అయితే 2022 సంవత్సరంలో తిరిగి గ్రామ పంచాయతీగా మార్చారన్నారు. అయినప్పటికీ ఉపాధి హామీ పథకం పనులు చేపట్టకపోవడంతో కూలీలు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉపాధి పనులు కల్పించాలని ఈ నెల 12న ఎంపీడీఓ కార్యాలయం ముందు వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్, ఆగస్టు 10: మండలంలోని మార్నెంపల్లి గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున బైక్ అదుపు తప్పి బోల్తా పడడంతో లక్ష్మన్నకు తీవ్ర గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం ముంటిమడుగుకు చెందిన లక్ష్మన్న గుంతకల్లుకు బైక్‌లో వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్నెంపల్లి గ్రామశివారులో ప్రమాదం జరిగింది. స్థానికులు అతడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పట్టుబడిన వాహనాలకు 14న వేలం

కణేకల్లు, ఆగస్టు 10: కణేకల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు ఈనెల 14వ తేదీన వేలం వేస్తున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ. మూడువేలు ముందస్తు డిపాజిట్ చేయాలన్నారు. ఒక వేళ వేలంలో వారికి వాహనాలు రాకపోతే డిపాజిట్ తిరిగి చెల్లిస్తామన్నారు. ఆసక్తి గల వారు 14వ తేదీన ఉదయం 10 గంటలకు సెబ్ కార్యాలయంలో హాజరు కావాలని ఆయన కోరారు.

గాలిమరల టెక్నీషియన్ మృతి

బెళుగుప్ప, ఆగస్టు 10: మండలంలోని నక్కలపల్లి గ్రామ సమీపంలో గాలి మరల టెక్నీషియన్ టీ వీరేష్ (32) ప్రమాదవశాత్తూ కిందపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బళ్లారి జిల్లా సిరిగెర గ్రామానికి చెందిన వీరేష్ ఏడాది క్రితం సుజలాన్ గాలిమరల కంపెనీలో టెక్నీషియన్‌గా చేరాడు. నక్కలపల్లి సమీపంలో గాలిమరల ఫ్యాన్ పనిచేయకపోవడంతో శుక్రవారం సాయంత్రం మరమ్మతు చేయడానికి పైకి ఎక్కాడు. అక్కడ సమస్యను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తూ జారి కిందకు పడి తీవ్రంగా గాయపడ్డాడు. సిబ్బంది వెంటనే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య కనక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

వర్షం కోసం పూజలు

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 10 : వర్షం కోసం మండలంలోని బోరంపల్లిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో గ్రామస్థులు శనివారం పూజలు చేశారు. అనంతరం దేవుడి ఫొటో చేతబట్టి భజనలు చేస్తూ ఏడు గ్రామాలను సందర్శనకు కాలినడకన వెళ్లారు. ఏడు గ్రామాలు సందర్శిస్తూ భజనలు చేస్తే వర్షాలు వస్తాయని ఆ గ్రామ ప్రజల విశ్వాసం.

సమయాన్ని వృథా చేయరాదు

గుత్తి, ఆగస్టు 10: ఇంజనీరింగ్ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలని పట్టణంలోని గేట్స్ కళాశాల ఎండీ రఘునాథరెడ్డి సూచించారు. కళాశాలలో మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు శనివారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండీ రఘునాథరెడ్డి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు నైపుణ్యాలను డెవలప్ చేసుకోవాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నేడు జరుగుతున్న నూతన ఆవిష్కరణలను గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్‌బాషా, హెచ్‌ఓడీ హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్లు, జేసీబీ సీజ్

తాడిపత్రి, ఆగస్టు 10: మండలంలోని పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లు, ఒక జేసీబీని శనివారం సీజ్‌చేశామని రూరల్ పోలీసులు తెలిపారు. పెన్నానది నుంచి కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు ఇసుకను జేసీబీ సాయంతో టిప్పర్లకు లోడ్ చేస్తుండగా దాడులు చేసి పట్టుకున్నాని, అనంతరం ఆయా వాహనాలను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక డంప్ సీజ్..

పట్టణంలోని నందలపాడులో ఉన్న ఇసుక డంప్‌ను ఎక్సైజ్ అధికారులు సీజ్‌చేశారు. పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసి డంపింగ్ చేసుకోవడంతో.. అందిన సమాచారం మేరకు దాడులు చేసి డంప్‌లను సీజ్‌చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఫణీంద్రారెడ్డి తెలిపారు.

భార్యపై భర్త దాడి

తాడిపత్రి, ఆగస్టు 10: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్న నాగరత్నపై శనివారం భర్త నాగార్జున కర్రతో దాడిచేసి గాయపరిచాడని పోలీసులు తెలిపారు. మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వడం లేదన్న కోపంతో నాగరత్నపై నాగార్జున కర్రతో దాడిచేసి గాయపరిచాడని, చికిత్స నిమిత్తం ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని,. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో రైతు మృతి

రాయదుర్గంరూరల్, ఆగస్టు 10: మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన రైతు వన్నూరుస్వామి(53) గుండెపోటుతో శనివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వన్నూరుస్వామి వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. తనకున్న మూడెకరాల పొలంలో గత మూడేళ్ల నుంచి వివిధ పంటలు సాగు చేసి నష్టపోయాడు. ఈ క్రమంలో రూ. 6 లక్షల వరకు అప్పు చేశాడని, వాటిని ఎలా తీర్చాలోనని తరచూ మధనపడుతుండేవాడని, ఈ క్రమంలో శనివారం ఉదయం ఒక్కసారిగా ఇంట్లో కుప్పకూలి పోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య చౌడమ్మ, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

హోటల్‌లో చోరీ

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 10 : మండలంలోని బోరంపల్లి వద్ద ఉన్న పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని ఓ హోటల్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బోరంపల్లికి చెందిన యర్రిస్వామి హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత రెండు రోజుల క్రితం బంధువుల ఊరికి వెళ్లారు. శనివారం ఉదయం హోటల్‌కు వచ్చి చూడగా తలుపులు తీసి ఉన్నాయి. వెంటనే లోపలికి వెళ్లి పరిశీలించి గ్యాస్ సిలెండర్, వంట సామగ్రిని చోరీకి గురైనట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ

● నృసింహస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

● పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

రాయదుర్గం రూరల్, ఆగస్టు 10: ఆలయాలకు శ్రావణ శోభ సంతరించుకుంది. శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా మండలంలోని మల్లాపురం గ్రామంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ, అదే విధంగా వజ్రవన్నూరు సమీపంలో వెలసిన అపులాపురం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే ఆయా మూలవిరాట్‌లకు సుప్రభాతసేవ , ప్రత్యేక అభిషేకా లు, అలంకరణలు, పూజలు, కుంమార్చనలు చేశారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ఆకుపూజ, నైవేద్య పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల వద్ద స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. అలాగే రేకులకుంట గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఆ ఆలయంలోని స్వామివారికి బళ్లారికి చెందిన పరశురాం, రేఖ దంపతులు రూ.2.50 లక్షలు విలువచేసే పంచలోహ కవచాన్ని సమర్పించారు. ఆలయ పెద్దలకు కవచాన్ని అందజేశారు.

బెళుగుప్ప: మండలంలోని బూదిగుమ్మ సంజీవరాయ స్వామికు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే ఆలయంలోని స్వామివారికి అర్చకులు పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారి మూలవిరాట్‌కు అర్చకులు అభిషేకాలు , ఆకుపూజ అలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారిని భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

పెన్నహోబిలంలో వైభవంగా పల్లకి సేవ

ఉరవకొండ: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. తర్వాత ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. శ్రావణ మాసం మొదటి శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఉరవకొండ పట్టణంలోని అభయాంజనేయ స్వామి, పంచముఖాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. మండలంలోని చిన్నముష్టూరు సమీపంలోని కల్లంబండ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, ఆకుపూజలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.



విప్రమలై లక్ష్మీనరసింహస్వామికి పల్లకిసేవ నిర్వహిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో అపులాపురం ఆంజనేయస్వామి



పెన్నహోబిలంలో ఉత్సవ మూర్తిని ఊరేగిస్తున్న భక్తులు



రథోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా వీరభద్రస్వామి రథోత్సవం

భారీగా తరలివచ్చిన భక్తులు

విడపనకల్లు, ఆగస్టు 10: మండలంలోని పాల్తూరు పంచాయతీలో ఉండబండ వీరభద్రస్వామి రథోత్సవ వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. వేకువజామునే అర్చకులు స్వామి వారితో పాటు భద్రకాళీ అమ్మవారి మూలవిరాట్‌లకు సుప్రభాత సేవ చేశారు. అలాగే మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణలు గావించారు. తర్వాత కుంకుమార్చన, పూజలు, మహాస్నపనము నిర్వహించారు. తర్వాత అభిజిత్ లగ్న శుభ పుష్కారాంశంలో స్వామి, అమ్మవాకి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ కల్యాణం చేశారు. సాయంత్రం స్వామి వారి ఆలయం నుంచి ఎదురు బసవన్న ఆలయం వరకూ మహారథోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తలివచ్చారు. ఈఓ రమేష్‌బాబు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

నెట్టికంటి సేవలో ఎస్పీ

గుంతకల్లు టౌన్, ఆగస్టు 10: కసాపురం నెట్టికంటి ఆంజనేయ ఆలయాన్ని ఎస్పీ మురళీకృష్ణ శనివారం రాత్రి సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. తర్వాత ఎస్పీ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. అర్చకులు స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, ఆలయ ఏఈఓ ధనుంజయ, రూరల్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఆలయ అధికారులు, అర్చకులు, పాల్గొన్నారు.



ఎస్పీకి స్వామి చిత్రపటం అందజేస్తున్న నెట్టికంటి ఆలయ అధికారులు

పెన్నహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో..

ఉరవకొండ: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహ స్వామిని ఎస్పీ మురళీ కృష్ణ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఎస్పీ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు స్వామి వారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు. సీఐ సురేష్‌బాబు ఉన్నారు.

న్యాయాధికారులు ఆలయాల సందర్శన

తాడిపత్రి, ఆగస్టు 10: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి, చింతల వెంకట రమణ స్వామి ఆలయాలను గుత్తి అడిషనల్ న్యాయాధికారి శ్రీహరి, తాడిపత్రి కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి దుర్గాకల్యాణి శనివా రం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అంతకుమునుపు న్యాయాధికారులకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. వారివెంట న్యాయవాదులు శివరామకృష్ణ, అనిఫ్, ఈఓ సుబ్రహ్మణ్యం, అధికారి ఆదినారాయణరెడ్డి ఉన్నారు.



బుగ్గరామలింగేశ్వరాలయంలో న్యాయాధికారులు

కోర్టును తనిఖీచేసిన గుత్తి న్యాయాధికారి

పట్టణంలోని కోర్టును గుత్తి అదనపు న్యాయాధికారి శ్రీహరి ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా పలు కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

గుత్తి, ఆగస్టు 10: పట్టణంలోని ఎంఎస్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవం సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ నాయకుడు నారాయణస్వామి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణించా లన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి, నియోజకవర్గ కార్యదర్శి వెంకటనాయక్, నాయకులు పాల్గొన్నారు.

ఆటోలో పేకాట

● రైల్వేస్టేషన్‌ను వేదికగా చేసుకుంటున్న జూదరులు

● చలనం లేని పోలీసులు

తాడిపత్రి, ఆగస్టు 10: ఇంతవరకు ముళ్లపొదలు, పాడుబడిన భవనాల్లో పేకాట ఆడుతుండడం మనం చూశాం. కానీ పేకాటరాయుళ్లు పట్టపగలే ఆటోలో పేకాట ఆడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఈ తతంగమంతా ఎక్కడో కాదండోయ్ స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణంలో ఆటోలో జరిగింది. రైల్వే స్టేషన్ ఆవరణంలో నిలిపి ఉంచిన ఒక ఆటోలో సుమారు ఆరేడుమంది పేకాటరాయుళ్లు పేకాట ఆడడం కనిపించింది. కొన్నిరోజులుగా ఇలా పేకాట జరుగుతున్నప్పటికి పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. పట్టపగలే ఈ పరిస్థితి ఉంటే ఇక రాత్రి సమయాల్లో అయితే ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకుంటేనే భయం వేస్తోంది. తాడిపత్రి రైల్వేస్టేషన్ నుంచి ప్రతిరోజూ వందలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో విద్యార్థినులు, మహిళలు కూడా ఉండడంతో రాత్రి సమయాల్లో ప్రయాణం చేయాలంటే జంకుతున్నారు. మరోవైపు మద్యం ప్రియులు కూడా పెట్రేగిపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా పోలీసు అధికారులు అటువైపు దృష్టి సారించి స్థానికులతోపాటు మహిళా ప్రయాణికులకు భరోసా ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదిత్యుడి సన్నిధిలో కలెక్టర్

ఉరవకొండ , ఆగస్టు 10: మండలంలోని బూదగవి గ్రామంలో గల సూర్యనారాయణస్వామి ఆలయాన్ని కలెక్టర్ వినోద్ కుమార్ శనివారం సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఆలయంలో కలెక్టర్ స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. ఆయనకు ఆలయ విశిష్టతను అర్చకులు తెలియజేశారు. తర్వాత స్వామి చిత్రపటాన్ని అందజేసి, శాలువాకప్పి సత్కరించారు. అలాగే తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

రంగనాథస్వామిని దర్శించుకున్న ఆర్డీవో

బ్రహ్మసముద్రం, ఆగస్టు 10: మండలంలోని వేపులపర్తి గ్రామంలో వెలసిన లక్ష్మీ రంగనాథస్వామి ఆలయాన్ని ఆర్డీఓ రాణిసుష్మిత శనివారం సందర్శించారు. శ్రావణమాసం సందర్భంగా ఆమె స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు పొందారు. అంతకుమునుపు ఆర్డీఓకు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఈశ్వర్, టీడీపీ నాయకులు వెంకటేష్, భీమప్ప, శివలింగ, చంద్ర తదితరులు ఘన స్వాగతం పలికారు. అర్చకుడు వేణుగోపాలస్వామి ఆలయ విశిష్టతను ఆర్డీవోకు వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మసముద్రం డీటీ శ్రీనాథ్‌రెడ్డి, ఆర్ఐ నాగిరెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

బొమ్మనహాళ్, ఆగస్టు 10 : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రాయదుర్గం సివిల్ జ్యుడిషియల్ కోర్టు న్యాయాధికారి రమ్య సూచించారు. మండలకేంద్రంలోని కేజీబీవీలో శనివారం ఆమె విద్యార్థినులకు మండల న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. ముఖ్యంగా బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. న్యాయం ప్రతి ఒక్కరి హక్కు అని తెలిపారు. చట్టాలపై అవగాహన ఎంతో అవసరమన్నారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులను కల్పించిందన్నారు. ప్రతి ఒక్కరికీ చట్టాల గురించి తెలియజేసేందుకు ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం వంటగది, లైబ్రరీ పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమలమ్మ, ఎస్ఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కూడేరు, ఆగస్టు 10: మండలంలోని కరుట్లపల్లికి చెందిన యువకుడు వన్నూరుస్వామి (22) ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాల్లోకెళ్తే.. వన్నూరుస్వామి గత జూలై 29వ తేదీన జల్లిపల్లి గ్రామానికి ద్రాక్ష మొక్కల కటింగ్ చేయడానికి ఆటోలో సహ కూలీలతో కలిసి వెళ్లాడు. పని ముగించుకొని ఇంటికి అదే ఆటోలో బయలుదేరారు. మార్గంమధ్యలో కుక్క అడ్డురావడంతో తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో వన్నూరుస్వామితోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన వన్నూరు స్వామిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

గుంతకల్లు, ఆగస్టు 10: పట్టణంలోని మునిసిపల్ పాత బాలుర హైస్కూలు (ప్రస్తుత గర్ల్స్ హైస్కూలు)లో 1988-89వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం అదే పాఠశాలలతో శనివారం గెట్‌టు గెదర్ నిర్వహించారు. అందులోఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి కూడా ఉన్నారు. దాదాపు 35 ఏళ్ల తర్వాత అందరూ ఒకే చోట కలవడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తర్వాత నాటి ఉపాధ్యాయులను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. పూర్వ విద్యార్థులు మురళి, ఫజులు, భాస్కర్, సత్య, ఉమామహేశ్వర్, డీఎల్ కిశోర్, రవూఫ్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, వీరేశ్, చిప్పగిరి ప్రతాప్ పాల్గొన్నారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

తాడిపత్రి, ఆగస్టు 10: ట్రాన్స్‌కో శాఖ పని తీరుపై ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆ శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన అధికారులతో సమావేశమై మాట్లాడారు. వ్యవసాయానికి అందించే 9గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో కోతలు లేకుండా చూడాలని, క్రమం తప్పకుండా విద్యుత్‌ను సరఫరా చేయాలని ఆదేశించారు. విద్యుత్ కోతల వల్ల పట్టణ, మండలవ్యాప్తంగా వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు ఇబ్బందిపడతారని తెలిపారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. యాడికి మండలంలోని గుడిపాడు వద్ద గల సాగర్ సిమెంట్స్ పరిశ్రమ వద్ద 132/33కేవీ సబ్‌స్టేషన్ ఇప్పటికే మంజూరుకాగా ఏర్పాటులో ఎందుకు అలసత్వం వహిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం తరఫున డిపాజిట్ మొత్తం చెల్లించాల్సి ఉందని, అప్పుడే సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టవచ్చునని అధికారులు సమాధానమిచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం జరిగితే యాడికి మండలంతో పాటు తాడిపత్రి మండలంలోని కొన్ని గ్రామాల్లో విద్యుత్ కోతలు ఉండవన్నారు. తాడిపత్రి మండలంలోని చిన్నపొలమడ, పెద్దవడుగూరు మండలంలోని కిష్టిపాడు లేదా యాడికి మండలంలోని రాయలచెరువు వద్ద కూడా సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడితే తాడిపత్రి మండలం, పెద్దపప్పూరు, యాడికి, పెద్దవడుగూరు మండలాలకు ఎంతో మేలు చేకూరుతుందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అలాగే పెన్నానదిలో ఏర్పాటుచేసిన విద్యుత్‌స్తంభాలు నేలకొరగడంతో పట్టణంలోని శ్మశానం పక్కనగల సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం విద్యుత్ సరఫరా ఆగిపోయిందని తెలిపారు. వీటిపై స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో మాట్లాడి పనులను మొదలుపెట్టిస్తానని పేర్కొన్నారు. సమావేశంలో గుత్తి డీఈ రాజశేఖర్, ఏడీలు రఘు, వసంతకుమార్, ఏఈలు ఉదయభాస్కర్, వీరాంజనేయరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాజారావు, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

ఇసుక అక్రమ రవాణా చేస్తే ఊరుకోను: జేసీపీఆర్

తాడిపత్రి, ఆగస్టు 10: ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే ఊరుకునేది లేదని, ఆఖరుకు తన బంధువైనా, స్నేహితుడైనా, శ్రేయోభిలాషి అయినా సరే సహించనని, కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. సోషల్‌మీడియా వేదికగా శనివారం ఆయన మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాకు ఎవరెవరు పాల్పడుతున్నది తనవద్ద నివేదిక ఉందని, కావాలంటే పంపుతానని తెలిపారు. నందలపాడులో ఇష్టమొచ్చినట్లు ఇసుక అక్రమ రవాణా సాగుతోందన్నారు. టిప్పర్లు, ట్రాక్టర్లు పట్టుబడ్డాయంటే మాత్రం ఏడాదివరకు బయటకు రావని అన్నారు. యజమానులు ఎవరూ ఇసుకకు బాడుగకు వాహనాలను ఇవ్వరాదని సూచించారు. ఐదేళ్ల నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి పోరాటం సాగిస్తున్నానని తెలిపారు. అక్రమ ఇసుక రవాణా విషయంలో నిక్కచ్చిగా ఉంటానన్నారు. ఎవరు ఏమి అనుకున్నా నా పద్ధతి ఇంతేనన్నారు. ఎవరి మనసు అయినా నొచ్చుకుంటే క్షమించండని ఆయన పేర్కొన్నారు.

సత్యమ్మకు జలాభిషేకం

తాడిపత్రి, ఆగస్టు10: జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురవాలని పట్టణ నడిబొడ్డున గాంధీకట్ట వద్ద వెలసిన సత్యమ్మతల్లికి శనివారం 101బిందెలతో బీజేపీ నాయకులు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకాల్‌రెడ్డి తదితరులు అమ్మవారికి జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రంగనాథరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

ఉరవకొండ, ఆగస్టు10: నారాలోకేష్ అభిమాన సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుడు, టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని కొకుంట్లలో శనివారం ఆయన్ను నారాలోకేష్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ సంఘానికి త్వరలో సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.



పయ్యావుల శ్రీనివాసులుతో ఆనంద్‌రెడ్డి తదితరులు

వైసీపీ నేతల్లో తగ్గని అధికార దాహం

ఏడో వార్డులో వీధిలైట్లను తొలగించి తీసుకెళ్లిన కౌన్సిలర్ భర్త

కళ్యాణదుర్గం, ఆగస్టు 10: ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయినా నియోజకవర్గంలోని ఆ పార్టీ నేతల్లో మాత్రం ఇంకా అధికార దాహం తగ్గడం లేదు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని 7వ వార్డులో వేసిన వీధిలైట్లను శనివారం వైసీపీ కౌన్సిలర్ భర్త సుధీర్ తొలగించి వెంట తీసుకెళ్లాడని ఆ కాలనీ ప్రజలు ఆరోపించారు. 7వ వార్డులో డ్రైనేజీ, వీధి లైట్లు లేక ఇబ్బందులకు గురవుతున్నామని స్థానిక ప్రజలు ఇటీవల ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మున్సిపల్ అధికారులకు చెప్పి ఆ వార్డులోని పలుచోట్ల వీధి లైట్లు వేయించారు. అయితే వార్డు వైసీపీ కౌన్సిలర్ భర్త సుధీర్ ఈ వార్డులో తాము గెలిచామని, తమ నాయకుడు తలారి రంగయ్య ఆ వీధిలైట్లు తెప్పించాడని, వాటిని ఏర్పాటు చేయడానికి వీల్లేదంటూ వేసిన వీధి లైట్లను తొలగించి తీసుకెళ్లాడని కాలనీ ప్రజలు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి మర్రన్న తెలిపారు. ఎమ్మెల్యే వేయించిన లైట్లను వైసీపీ కౌన్సిలర్ తొలగించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కౌన్సిలర్ తీరుపై కాలనీప్రజలు మండిపడుతున్నారు.

మొక్కలను నాటి.. సంరక్షించాలి

బొమ్మనహాళ్, ఆగస్టు 10: ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని టీడీపీ సీనియర్ నాయకుడు అప్పారావు సూచించారు. మండలంలోని దేవగిరి గ్రామంలో శనివారం ఆయన మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ మొక్కలను పెంచితే భవిష్యత్తులో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలలో మొక్కలు నాటాలని తెలిపారు. నాయకులు గోవిందు, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలి

రాయదుర్గంరూరల్, ఆగస్టు 10: విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొట్రేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్‌జీఓ కార్యాలయంలో శనివారం ఈ మేరకు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మత్తు పదార్థాలను, బెట్టింగ్ యాప్‌లను, కల్తీ ఆహారాలను, మెడికల్ మాఫియాను ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసిన కల్తీ ఆహారాలతో, కల్తీ మందులతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం కల్తీ మాఫియాను అరికట్టడంలో పూర్తిగా బాధ్యత తీసుకొని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. రాష్ట్రంలో నూతన పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం రూపల్పన చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.35 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 3, 4, 5వ తేదీలలో విజయవాడలో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి యువతీ, యువకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఏఐవైఎఫ్ రాయదుర్గం తాలూకా అధ్యక్షుడు కుమార్‌నాయక్, నాయకులు దినకర్, మాధవ్, చరణ్, బాలాజీ, హనుమంతు, లోహిత్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు ప్రజలకు రుణ పడి ఉంటా: ఎమ్మెల్యే

గుంతకల్లుటౌన్, ఆగస్టు 10: శాసనసభ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గుంతకల్లు నియోజకవర్గ ప్రజలకు రుణ పడి ఉంటానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యేకు సన్మాన కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యేను పూలమాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు, ఈఓ రాముడు మాట్లాడుతూ పెన్షనర్ల భవన పైఅంతస్తు నిర్మాణానికి సహకారం అందించాలని, ఇల్లు లేని విశ్రాంత ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను పరిష్కరిస్తామన హామీ ఇచ్చారు. ఎన్నికల్లో తనను ఆదరించి భారీ మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ఎంతో రుణపడి ఉంటానన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చలపతి, ప్రధాన కార్యదర్శి రామారావు, ఉపాధ్యక్షుడు బీమన్న, ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, వాల్మీకి సాధికారిక జిల్లా కార్యదర్శి తలారి మస్తానప్ప, నాయకులు కేసీ హరి, అంజి, ఆమ్లెట్‌మస్తాన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సన్మానిస్తున్న పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు